సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 24 । జనవరి । 2025



బాలికలు భవిష్యత్తు దీపికలు

బాలికలు భవిష్యత్తు దీపికలు అని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బాలికల సంరక్షణ పోస్టర్ ఆవిష్కరించారు. - IIలో



ఉపాధి లెక్క.. అక్రమాలు పక్కా!

ఉపాధి హామీ పనులు కూటమి నేతల జేబులు నింపే ఏటీఎంలుగా మారాయి. అధి కారుల అండతో దోచుకుంటున్నారు. - IIలో



టిప్పర్ బోల్తా

వెదురుకుప్పం మండలం గోవిందవారిపల్లె సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద గురువారం టిప్పర్ బోల్తా పడింది. - IIలో

న్యూస్‌రీల్

రెవెన్యూ సమస్యలు సత్వరం పరిష్కరించాలి



మండల అధికారులతో మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

గుడుపల్లె: రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. గురువారం మండలంలోని అత్తినత్తం, గుడుపల్లె, వెంగేపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించారు. అత్తినత్తం గ్రామంలోని పోరంబోకు భూములను పరిశీలించారు. అనంతరం వెంగేపల్లిలో జరుగుతున్న భూ రీసర్వేను పరిశీలించారు. రైతులకు సంబంధించిన భూములను వారి సమక్షంలో సబ్ డివిజన్ చేసి అనుభవం, రికార్డుల పరంగా ఎలాంటి సమస్యలు లేకుండా సర్వే చేసి రైతులకు అప్పగించాలన్నారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అర్జీ పెట్టుకున్న రైతు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రైతులను కార్యాలయాల చుట్టు తిప్పించుకోవచ్చని హెచ్చరించారు. ఆర్డీఓ శ్రీనివాసరాజు, తహసీల్దారు సీతారామ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.11.20 లక్షలు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

తవణంపల్లె: అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. హుండీల ద్వారా ఆలయానికి రూ.11.20 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈఓ హనుమంతురావు తెలిపారు. గురువారం అర్ధగిరి క్షేత్రంలోని మండపంలో ఎండోమెంట్ అధికారి వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షణలో నవంబర్ నెల 6వ తేదీ నుంచి గురువారం వరకు హుండీలోని భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. మొత్తం రూ.11,20,813 వచ్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ సాయిసులోచన రెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొనన్నారు.

ప్రతి ఆదివారం మధ్యాహ్న భోజనం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఆదివారం మధ్యాహ్న భోజనం పెట్టాలని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెట్టాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యక్రమం అమలు చేస్తున్నామని చెప్పారు. శనివారం మధ్యాహ్న భోజనం మెనూను యథాతథంగా అమలు చేయాలన్నారు. సోమవారం మెనూనే ఆదివారం కూడా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని హెడ్ మాస్టర్లను డీఈఓ ఆదేశించారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు. గురువారం చిత్తూరులో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యవసర ప్రాంతాల్లో ఫైర్ వెహికల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటవీ సమీప గ్రామ ప్రజలకు అవగాహన కల్పనతోపాటు, కరపత్రాలు అందించాలన్నారు. అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణ ముఖ్యమన్నారు. వీటిపై మొబైల్ టీంలు నిత్యం పర్యవేక్షించాలన్నారు. గజదాడుల నుంచి ఎటువంటి ప్రాణ, పంట నష్టాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏనుగుల సంచారంపై సహాయ బీట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా కందకాలు తవ్వాలన్నారు. అలాగే సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సోమల మంగళం పేట వద్ద 6 కిలోమీటర్ల ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ.45 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. అటవీ ప్రాంతంలోని వన్యమృగాలు దాహార్తి తీర్చుకోవడానికి బయట రాకుండా అడవిలోనే నీటిని ఏర్పాటు చేయాలన్నారు.

పలమనేరులో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ గత ప్రభుత్వంలో ఇలా..



అగ్రి ల్యాబ్..

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రస్తుతం పలమనేరులో ఇలా..



అభయం.. శూన్యం!

విత్తనం కొద్దీ పంట అంటారు పెద్దలు.. నేడు విపణిలో నకిలీలు రాజ్యమేలుతున్నాయి.. అన్నదాతను నిలువునా ముంచుతున్నాయి.. వెరసి దిగుబడులు దిగజారుతున్నాయి.. కర్షకుడు కష్టాల సుడిలో చిక్కుకుంటున్నాడు.. ఈ విషయం గుర్తించిన జగనన్న పుడమి పుత్రుడి సంక్షేమానికి పెద్ద పీట వేశారు. నకిలీలను అరికట్టేందుకు పల్లె ముంగిటకే అగ్రిల్యాబ్‌లను తెచ్చారు.. అయితే నేడు అన్నదాతను కాల‘కూటమి’ కాటేస్తుంది. ప్రస్తుత సర్కారు అగ్రిల్యాబ్‌లను నిర్వీర్యం చేస్తోంది. ఫలితంగా రైతులకు ఆ ల్యాబ్‌ల అభయమివ్వక.. సేవలందక వారు ఇక్కట్లు పడుతున్నారు. ఇదీ అగ్రిల్యాబ్‌ల వైచిత్రి.

అంతంత మాత్రంగా అగ్రి ల్యాబ్ సేవలు

- నియోజకవర్గానికో ల్యాబ్‌ను నిర్మించిన గత ప్రభుత్వం
- పూర్తిస్థాయి సేవలు ప్రారంభించని కూటమి సర్కారు
- తుప్పు పట్టి.. నిరుపయోగంగా పరికరాలు
- ఇన్‌చార్జ్‌ల పాలనతో తప్పని మూత
- సేవలందక అన్నదాతలకు తిప్పలు



నిరుపయోగంగా ఉన్న వెటర్నరీ టెస్టింగ్ ల్యాబ్

పలమనేరు: రైతులకు అందుబాటులో బహుళ సేవలందించే లక్ష్యంతో గత ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఓ అగ్రిల్యాబ్‌ను నిర్మించింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గద్దె నెక్కగానే డాక్టర్ వైఎస్సార్ అగ్రిల్యాబ్‌లకు ఉన్న డాక్టర్ వైఎస్సార్ పేరును తొలగించి, కసి తీర్చుకుంది. ఇందులో పనిచేసేందుకు రెగ్యులర్ సిబ్బందిని నియమించలేదు. వ్యవసాయ, పశుసంవర్థకశాఖల్లోని ఉద్యోగులనే వీటికి ఇన్‌చార్జ్‌లుగా చేసింది. రెగ్యులర్ విధులతోపాటు ల్యాబ్‌లో వారు సేవలందించాల్సిందిగా ఆదేశించింది. దీంతో పనిభారం అధికమై వారు రెండు చోట్ల విధులు నిర్వహించలేకపోతున్నారు. ఫలితంగా రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన అగ్రిల్యాబ్‌లు కొన్ని మూత పడుతున్నాయి. అందులోని పరికరాలు తుప్పుపడుతున్నాయి. రైతులకు అవసరమైన పూర్తి స్థాయి సేవలుసెప్పిటికీ అందుతాయోనని కర్షకులు నిరీక్షిస్తున్నారు.

ఎప్పుడో తెరిచి ఆపై తాళాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాబ్‌లో ఉన్న అరకొర సిబ్బందిని తొలగించింది. ఇన్‌చార్జ్‌లను నియమించింది. దీంతో వారు ల్యాబ్‌లకు తాళాలు వేస్తున్నారు. ఫలితంగా ల్యాబ్‌ల్లోని పశు పరిశోధన పరికరాలు, పరీక్షల కిట్లు, ఇతర కిట్లు తుప్పుపట్టాయి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ వ్యవస్థను పతనం చేసిన కూటమి ప్రభుత్వం అగ్రిల్యాబ్‌లను సైతం నిర్వీర్యం చేసి రైతులపై పగబట్టిందనే మాట వినిపిస్తోంది.

ఒక్కొక్కటి రూ.70 లక్షలతో నిర్మాణం

గత ప్రభుత్వం రాష్ట్రంలతోని ప్రతి నియోజకవర్గంలో రూ.70 లక్షల వ్యయంతో అగ్రిల్యాబ్‌ను నిర్మించింది. చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 2023లో రూ.4.9 కోట్ల వ్యయంతో అగ్రిల్యాబ్‌లు నిర్మించింది. రైతు దినోత్సవం సందర్భంగా వాటిని ప్రారంభించింది. వాటి ద్వారా నియోజకవర్గ స్థాయిలోని రైతులకు విత్తనాలు, ఎరువుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించుకునే వీలు కల్పించింది. నకిలీ విత్తనాలను గుర్తించుకుని, వ్యవసాయం లాభసాటిగా మార్చుకునే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది. అలాగే పశువులకు సోకే వ్యాధుల నిర్ధారణ సైతం తెలుసుకునేందుకు దోహదపడింది. గతంలో ఈ సేవలు కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఆ అవసరం లేకుండా ప్రభుత్వం నియోజకవర్గంలోనే టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది.

రెగ్యులర్ సిబ్బంది లేమి

అగ్రిల్యాబ్‌ల్లో రెగ్యులర్ సిబ్బంది లేరు. దాదాపు అన్ని ల్యాబ్‌లు ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగుతున్నాయి. గతంలో ఒక ఏఓ, ఇద్దరు ఏఈఓలు ఉండేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే కూటమి సర్కారు హెడ్‌క్వార్టర్స్‌లోని ఏఓను ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా, వ్యవసాయశాఖకు చెందిన మరో ఇద్దరు సిబ్బందికి రెండు విధులు అప్పగించింది. దీంతో వారు ల్యాబ్‌లకు వెళ్లడానికి కుదరడం లేదు. రైతుల పండించిన విత్తనాలను పరీక్షించడం, ముఖ్యంగా ప్రైవేటు వ్యాపారుల వద్ద కొన్న విత్తనాలు, సేంద్రియ ఎరువుల పేరిట ప్రైవేట్ ఏజెన్సీలు రైతులకు అంటగట్టే వాటికి పరీక్షలు చేసుకునే వీలు లేకుండా పోయింది. నిబంధలన మేరకు విత్తనాల్లో మొలక శాతం, నాణ్యతను పరిశీలించి రైతులకు రిపోర్టులు అందించాల్సి ఉన్నా ఆ సేవలు నేడు నామమాత్రంగా అందుతున్నాయి. దీంతో ఇవి ఉన్నా లేనట్టుగానే పరిస్థితి తయారైంది.

ఎప్పుడు తెరుస్తారో ఎవరికి తెలుసు?



ఈ ప్రాంతంలోని వరి సాగు చేసే రైతులు వరి పండించిన తరువాత పంట దిగుబడి బాగుంటే ఆ ధాన్యాన్ని అలాగే నిల్వ ఉంచి దాన్ని మరో పంటకు విత్తనాలుగా వాడడం ఆనవాయితీగా ఉంది. అగ్రిల్యాబ్‌లో సిబ్బంది అందుబాటులో ఉండి, సేవలు సక్రమంగా అందుంటే రైతులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇక్కడ హెచ్‌ఎఫ్ జాతి పశువులు ఎక్కువగా ఉన్నాయి. వాటికొచ్చే వ్యాధుల నివారణ తదితరాలకు ఇక్కడ సిబ్బంది అసలు లేరు. దీంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. **– గోవిందురెడ్డి, బేరుపల్లి, పలమనేరు మండలం**

ఏఓలే ఇన్‌చార్జ్‌లు



పలమనేరు అగ్రిల్యాబ్‌కు నన్ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. మరో ఇద్దరు ఏఈఓలు కావా ల్సి ఉండగా కుప్పానికి చెందిన ఒకరిని, ఏడీ కార్యాలయానికి చెందిన ఒకరికి ఇన్‌చార్జ్‌లుగా పోస్టింగ్ ఇచ్చారు. రైతులు, ట్రేడర్ల నుంచి వచ్చే ఎరువులు, విత్తనాల శ్యాంపిళ్లను పరీక్షిస్తుంటాం. ఇక పశు సంవర్థక శాఖకు సంబంధించిన పరీక్షలపై మాకు అవగాహన లేదు. రెగ్యులర్‌గా ఏఓని ఇన్‌చార్జ్‌గా నియమించడంతో రెండు విధులు నిర్వహించడం కష్టంగా ఉంది. దీంతో అప్పుడప్పుడు ల్యాబ్‌కు వెళుతుంటాం. **– సంధ్య, అగ్రి ల్యాబ్ ఇన్‌చార్జ్, పలమనేరు**

ఆవాస్ యోజన అర్బన్ 2.0కు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఆవాస్ యోజన అర్బన్ 2.0 అమలుకు పకడ్బందీగా కసరత్తు చేపడుతున్న జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ గోపాల్‌నాయక్ వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0ను అమలు చేసేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఈ పథకానికి 15 వేలకు పైగా దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి, గృహం కట్టుకునేందుకు అర్హత, ఆసక్తి ఉన్న లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీ సూచించారు.

ఎన్నికల విధులకు ఉత్తమ అవార్డులు





చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు, ఎన్నికల టెక్నికల్ ఉద్యోగి ఉమాపతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గత సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉన్నతాధికారులు, ఉద్యోగులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తమ అవార్డులకు ఎంపిక చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ వివేక్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు గత సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించిన ఎస్పీ వీఎన్ మణికంఠ చందోలును బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డుకు ఎంపిక చేశారు. అలాగే జిల్లాలోని నగరి ఏఈఆర్‌ఓగా విధులు నిర్వర్తించిన డి.రవికుమార్, నగరి 134 పోలింగ్ స్టేషన్ బీఎల్వో త్యాగరాజన్, నగరి 138 పోలింగ్ స్టేషన్ బీఎల్వో సుభాషిణి, చిత్తూరు కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న టెక్నికల్ ఉద్యోగి ఉమాపతిని అవార్డులకు ఎంపిక చేశారు. ఎంపికైన ఉన్నతాధికారులు, ఉద్యోగులు 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించనున్నారు.





అమ్మకు ప్రేమతో..

ఆత్మీయ నేస్తం.. అమృత హస్తం.. మురిసే సౌభాగ్యం.. నన్ను నడిపించే సమస్తంగా అనురాగం పంచిన ఓ అమ్మా.. నీ కోసం ప్రేమతో.. అన్నట్టుంది ఈ చిత్రంలో చిన్నారి తల్లి కోసం పడుతున్న తాపత్రయం. చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో ఓ ఐదేళ్ల చిన్నారి వాటర్ బాటిల్ తలపై పెట్టుకుని.. అతి కష్టం మీద అమ్మా...అమ్మా అంటూ నెమ్మదిగా మెట్లు ఎక్కింది. బరువు మోయలేక మోసుకెళ్లింది.. అమ్మపై తన్న కున్న అనుబంధం, ఆప్యాయతను చాటుతోంది ఆ చిన్నారి. ఈ చిత్రం చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గురువారం సాక్షాత్కరించింది. ఆస్పత్రిలోని మొదటి అంతస్తులో ఉన్న రోగులకు భవనం కింద ఆస్పత్రి ఆవరణలో ఉన్న వాటర్‌ప్లాంట్ నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించడంతోనే ఓ చిన్నారి అవస్థ పడాల్సి వచ్చిందని ఆస్పత్రిలోని పలువురు వాపోయారు.

– చిత్తూరు రూరల్ (కాణిపాకం)

పీఎం ముఖాముఖికి ప్రభుత్వ స్కూలు విద్యార్థి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రధానమంత్రితో ముఖాముఖి కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రోహిత్ ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష శాఖ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఏపీసీ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ముఖాముఖి అయ్యే అవకాశం దక్కడం గొప్ప విషయమన్నారు. ఐరాల మండలం పైపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రోహిత్ ఈ నెల 24 నుంచి 29 వరకు ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ప్రధానమంత్రి ముఖాముఖి కార్యక్రమానికి ఎంపికై చిత్తూరు జిల్లాకు గర్వకారణంగా నిలిచారని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అరుణ్‌కుమార్, గైడ్ టీచర్ హిమగిరిరెడ్డి, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారి జయప్రకాష్ పాల్గొన్నారు.



ఎంపికైన రోహిత్‌ను అభినందిస్తున్న ఏపీసీ వెంకటరమణ

వరసిద్ధునికి ఐదు వెండి బిందెలు



కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన సాయిరాజ్ రూ.5 లక్షలు విలువ చేసే ఐదు వెండి బిందెలు సమర్పించారు. వాటిని ఆలయ ఈవో పెంచల కిషోర్‌కు అందజేశారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. – కాణిపాకం

పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్ వేగవంతం

చిత్తూరు కార్పొరేషన్: పీఎం సూర్యఘర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతంగా చేయాలని ట్రాన్స్‌కో సీఎండీ సంతోషరావు ఆదేశించారు. గురువారం ఎస్ఈ, ఈఈలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ పథకం మంజూరైన ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 2 కేవీ సామర్థ్యం గల సౌరఫలకాలు పెడతారన్నారు. తద్వారా వారికి ఉచిత విద్యుత్ అందించనున్నమన్నారు. జిల్లాలో 55 శాతం మాత్రమే నమోదు జరిగిందన్నారు. ఈ నెలలోపు వందశాతం పూర్తి చేయాలన్నారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కోసం జిల్లాలో 35 ప్రభుత్వ స్థలాలు గుర్తించామన్నారు. 5 ఎకరాల స్థలంలో ఒక మెగావాట్ ఉత్పత్తి చేసే సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. అక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్‌ను సంబంధిత ప్రాంతాల వ్యవసాయ సర్వీసులకు అందించనున్నట్లు తెలిపారు. ఈఈలు మునిచంద్ర, జగదీష్, సురేష్, ఏఓ ప్రసన్న ఆంజనేయులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,223 మంది స్వామివారిని దర్శించుకోగా.. 19,704 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.10 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గీత..కూటమి మేత

ఎన్నికల ‘మాయ’ ఫెస్టోలో కల్లుగీత కార్మికుల సంక్షేమమే మా ధ్యేయం.. మద్యం దుకాణాల్లో పది శాతం కేటాయిస్తాం.. ఇచ్చిన మాట మేరకు హామీ అమలు చేశాం.. అని కూటమి నేతలు ఊదరగొట్టుడు.. ఇదీ నాణేనికి ఓ వైపు మాత్రమే. రెండో వైపు చూస్తే గీత కార్మికుల దుకాణాలు దక్కుతాయా? బినామీలతో కూటమి నేతలే చక్రం తిప్పుతారా? అన్నది సందేహం .. ఇది నిజమేనంటున్నారు పేద కార్మికులు. ఇప్పటికే బినామీలను సిద్ధం చేశారని.. వారికే కేటాయింపునకు రంగం సిద్ధమైంది. గీత కార్మికుల పేరిట మేత భాయంగా కనిపిస్తోంది.

- కల్లు గీత కార్మికులకు జిల్లాలో పది మద్యం దుకాణాలు
- లైసెన్సు ఫీజు తగ్గడంతో బినామీలపై ‘కూటమి’ కన్ను
- నిజమైన గీత కార్మికులకు దుకాణాలు అనుమానమే



చిత్తూరు అర్బన్: నేతి అన్నం చూపించి.. రుచి చూసేలోపు మట్టిలో విసిరేసిన చందంగా మారింది కూటమి ప్రభుత్వం విడుదల చేసిన కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు ఉత్తర్వులు. వాటిని పరిశీలిస్తే నిజమైన కార్మికులకు మేలు చేకూరేలా కనిపించడంలేదు. పేరుకు మాత్రం గీత కార్మికులకు చిత్తూరు జిల్లాలో పది దుకాణాలు కేటాయిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ.. కూటమి నేతల వద్ద ఉన్న బినామీలకే ఈ దుకాణాలు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. పైగా కల్లుగీత కార్మికుల జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దుకాణాలు ఇస్తున్నారా? దుకాణాలు ఎక్కడ పెడుతున్నారు? ఆ ప్రాంతంలో ఉన్న గీత కార్మికుల ఉప కులాలు ఏవి? అనే ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు.

జిల్లాలో పది దుకాణాలు

జిల్లాలో పది మద్యం దుకాణాలకు గీత కార్మికులకు కేటాయించారు. ఇందులో గౌడ్ కులాలకు ఒకటి, ఈడిగలకు ఏడు, గౌడకు ఒకటి, గౌండ్లకు ఒకటి చొప్పున ఇస్తున్నట్లు ప్రభుత్వం జీఓ పేర్కొంది. దుకాణాలు కావాలనుకునే గీత కార్మికులు లైసెన్సు రుసుం నాన్ రీఫండబుల్ రూపంలో రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. రెండు రోజుల్లో జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి దరఖాస్తుల కోసం నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆయా జిల్లాల కలెక్టర్లు లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తారు. ఒక అభ్యర్థి ఆయా జిల్లాల పరిధిలో కేటాయించిన అన్ని దుకాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ దుకాణాలు లాటరీలో వస్తే.. ఒక్క దుకాణం మాత్రమే ఎంచుకోవాలి. లైసెన్సు ఫీజును అన్-రిజర్వు దుకాణాల ఫీజుతో పోలిస్తే 50 శాతం తగ్గించారు. అంటే 50 వేల కంటే తక్కువ జనాభా ఉన్న మండలాల్లో రూ.27.50 లక్షలు, 50 వేల పైబడి జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.32.50 లక్షలుగా నిర్ణయించారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు చెల్లుబాటయ్యేలా లైసెన్సులు జారీ చేయనున్నారు. ఇప్పటికే ఉన్న అన్-రిజర్వుడు మద్యం దుకాణాలు మూడు నెలల క్రితం ఏర్పాటైతే, ఆ ఆదాయాన్ని గీత కార్మికులు కోల్పోయినట్టేనని, మరోవైపు కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా కూటమి ఎమ్మెల్యేల వద్ద ఉన్న బినామీలకు దుకాణాలు కేటాయించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని, అసలైన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జిల్లాకు కేటాయించిన పది దుకాణాలకు ఎక్కడెక్కడ పెట్టాలనేది కూడా రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించనుంది. ఈ బాధ్యతలను రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్‌కు అప్పగించింది. దుకాణాలను ఎక్కడ పెట్టాలనే విషయం కమిషనర్ నిర్ణయించిన తరువాత, ఇందులో గౌడ్, ఈడిగ, గౌడ, గౌండ్ల ఉప కులాలకు చెందిన కార్మికులకు ఏయే దుకాణాలు కేటాయించాలో చిత్తూరులో కలెక్టర్ శుక్రవారం లాటరీ పద్ధతిలో నిర్ణయించే అవకాశం ఉంది. ఆపై మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను స్వీకరించడం, ఒకటి కన్నా ఎక్కువ దరఖాస్తు వచ్చిన వాటికి లాటరీ తీయడం జరుగుతుంది.

బినామీలు సిద్ధం

జీఓ విడుదలైన గంటల్లోనే కూటమి పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు వారి బినామీలను సిద్ధం చేసుకున్నారు. కుల ధ్రువీకరణ పత్రం ఇప్పించేసి, దరఖాస్తు రుసుము కూడా చెల్లించి, కార్మికుల కడుపు కొట్టి దుకాణాలకు దక్కించుకోవాలని పక్కాగా వ్యూహాలు రూపొందించుకున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలికలు

పులిచెర్ల(కల్లూరు): జిల్లా హాకీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం చిత్తూరులో జరిగిన జిల్లా బాలికల సబ్ జూనియర్ హాకీ పోటీల్లో మండలంలోని కావేటిగారిపల్లె జెడ్పీ హైస్కూలులో చదువుతున్న బాలికలు వి.జయశ్రీ , యు. హిమశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఎ.మంజువాణి తెలిపారు. ఈనెల 27 నుంచి 29 వరకు అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జూదరుల అరెస్టు

పుంగనూరు: మండలంలోని బోడేవారిపల్లె వద్ద జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.46 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈడిగపల్లె, బోడేవారిపల్లె, బోయకొండ, పుంగనూరు సరిహద్దు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. ఆ సమయంలో బోడేవారిపల్లె వద్ద జూదం ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పేకాట, కోడిపందెంపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వివాహిత ఆత్మహత్య



స్వప్న మృతదేహం

కుప్పంరూరల్: భర్త వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో మనస్తాపానికి గురైన భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుప్పం మండలం పలార్లపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుప్పం పోలీసుల కథనం మేరకు.. పలార్లపల్లి గ్రామానికి చెందిన కోదండపాణి, స్వప్న ప్రేమించుకుని, పెద్దలను ఒప్పించి ఐదేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల భర్త ప్రవర్తన సక్రమంగా లేకపోవంతో కుటుంబంలో గొడవలు చోటు చేసుకున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం చేసుకున్నారు. అయినా కోదండపాణి తీరులో మార్పు రాలేదు. దీంతో భార్య స్వప్న(25) మనస్తాపానికి గురై గురువారం ఇంట్లోని పైకప్పునకు ఉరివేసుకుంది. తల్లి ఉన్నామలై ఫిర్యాదు మేరకు కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. స్వప్న శవానికి గురువారం పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

భూమికి ఎసరు.. భద్రత అత్తేసరు!

ప్రభుత్వ స్థలాలు.. పోరంబోకు భూములు.. గ్రామకంతం.. ఇలా ఒకటేంటి అన్నీ కూటమి నేతల చెరలో చిక్కుకుంటున్నాయి. నీకిది.. నాకది అని పంచుకుంటున్నారు. ఖరీదైన భూమిపై కన్నేసిన ఓ నేత గ్రామకంతం స్థలంలో మినీ గోకులం నిర్మిస్తున్నాడు. గ్రామస్తులు ఫిర్యాదు చేసినా.. తహసీల్దార్ గ్రామకంతంగా నిర్ధారించినా.. అధికార యంత్రాంగం నిద్రమత్తులో జోగుతోంది. ఫలితంగా ఆ స్థలం అక్రమార్కుల అధీనంలోకి వెళుతోంది. ఈ అక్రమాల ఘనత చిత్తూరు మండలం ఎగువమాసాపల్లిలో చోటు చేసుకుంది.

- గ్రామకంఠ భూమిలో మినీ గోకులం షెడ్డు నిర్మాణం
- అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు
- గ్రామకంతం భూమిగా గుర్తించిన రెవెన్యూ అధికారులు
- ఎంపీడీఓకు గ్రామకంతం భూమిగా తహసీల్దార్ నోటీసులు
- అయినా ఆగని షెడ్డు నిర్మాణం
- పట్టించుకోని మండల అధికారులు



గ్రామకంతం భూమిలో నిర్మిస్తున్న షెడ్డు

సాక్షి టాస్క్‌ఫోర్స్: నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణ భూమిలో మినీ గోకులం షెడ్డు నిర్మాణం అడ్డగోలుగా సాగుతోంది. ఓ కూటమి నేత ఆ భూమిని తన అడ్డాగా ప్రకటించుకుని, షెడ్డు కట్టేస్తున్నాడు. అధికారాన్ని అడ్డుగా పెట్టి బెదిరింపులకు గురి చేస్తున్నాడు. తీరా గ్రామస్తులు ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు గ్రామ కంతం భూమిగా గుర్తించి ఎంపీడీఓ నోటీసులు పంపారు. అయినా షెడ్డు నిర్మాణం మాత్రం ఆగలేదు. మండల అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు మండలం ఎగువమాసాపల్లిలో రక్షిత మంచినీటి ట్యాంకు ఆనుకుని గ్రామకంత భూమి ఉంది. గ్రామ పెద్దలు తీర్మానంతో 2.68 సెంట్ల భూమిని గ్రామ అవసరాల కోసం వదిలిపెట్టారు. ఈ భూమి చాలా ఏళ్లుగా ఖాళీగానే ఉంది. దీనిపై స్థానిక కూటమి నేత కన్ను పడింది. ఈ భూమిని చూపించి, మినీ గోకులం మంజూరు చేయించుకున్నాడు. షెడ్డు కట్టేందుకు పునాదులు వేశాడు. దీంతో గ్రామస్తులు ఏకమై ప్రజావేదికలో ఫిర్యాదు చేశారు. ఆపై విచారణ చేపట్టిన అధికారులకు ఆ నేత నుంచి బెదిరింపులు వచ్చాయి. తర్వాత తప్పుడు రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి, తహసీల్దార్‌పై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్ని గట్టిగా వార్నింగ్ ఇచ్చారని, ఈ దెబ్బతో ఆ నేత తోకముడిచినట్లు తెలిసింది.



said land doesn't cover in any layout Plan at present the land is not in possession of any one as per Revenue Enquiry.

In the above circumstances there is no proof of enjoyment and link documentary proof of ownership of the Sri. M.Dhanajayulu. Hence it is unable to decide the ownership and no records are kept in Revenue Department pertaining to the Sy.No:184 as the land is classified as gramakantam.

As per Go.Ms.No:187 dated:27.05.2015 " It shall be the responsibility of the Gram panchayats to take appropriate action in respect of Gramakantam lands including protection of the extents of lands meant for community purpose".

The VRO,VS and MRI reports along with A Register copy are enclosed herewith for further action in the matter.

Yours Faithfully
TAHSILDAR
CHITTOOR RURAL MANDAL
CHITTOOR DISTRICT

గ్రామకంత భూమిగా తహసీల్దార్ ఇచ్చిన పత్రం

అది గ్రామకంత భూమే

ఎగువమాసాపల్లి రెవెన్యూ 184 సర్వే నంబర్‌లోని 2.68 సెంట్ల భూమి ఏ–రిజిస్టర్ ప్రకారం గ్రామకంతం భూమి అని తహసీల్దార్ నిర్ధారించారు. ఎంపీడీఓకు ఆ భూమి గ్రామకంతమేనన్ని స్పష్టం చేస్తూ...దీనిపై ఎవరికి ఎలాంటి హక్కులేవంటూ రాత పూర్వకంగా నోటీసు పంపారు. అందులో పిల్లర్ వేసిన వ్యక్తికి కూడా ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే ఆ భూమిని కాపాడాల్సిన బాధ్యత జీఓ నంబర్ 187 ప్రకారం పంచాయతీ చేతిలోనే ఉందని, ఆ నోటీసులో వివరించారు. అయినా మండల అధికారులు ఈ అక్రమ నిర్మాణ విషయంలో ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

రెండు నెలలుగా ఫిర్యాదుల పోరు

షెడ్డు నిర్మాణానికి పునాదులు పడినప్పటి నుంచి ఈ అక్రమ నిర్మాణంపై అధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. గుంతలు తవ్వడం మొదలుకుని గోడల నిర్మాణం వరకు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఆ నేత బెదిరింపులకు భయపడి మౌనం పాటిస్తున్నారని గ్రామస్తులు విమర్శలు చేస్తున్నారు. కాగా తొలుత షెడ్డు నిర్మాణానికి ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది మార్కింగ్ పనులు జరిగి పోగా..తర్వాత గ్రామకంత భూమిగా తెలుసుకుని బిల్లులు పెడింగ్‌లో పెట్టారు. అయినా నిర్మాణ పనులు ఆగడం లేదని, యథావిధిగా సాగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని అంటున్నారు. లేకుంటే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళతామని హెచ్చరిస్తున్నారు.

శిలా ఫలకం ధ్వంసం



గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకం

సదుం: మండలంలోని మొరవపల్లె వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తు లు ధ్వంసం చేయడం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శిలాఫలకంపై మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి చిత్రా లు ఉండడంతో రాజకీయ కక్షతోనే ధ్వంసం చేశారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. చీకలచేనుకు చెందిన కొందరిపై అ నుమానం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలికలు భవిష్యత్తు దీపికలు



సంతకం చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : బాలికలు భవిష్యత్తు దీపికలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని భేటీ బచావో భేటీ పడావో సిగ్నేచర్ క్యాంపెయిన్, బాలికల సంరక్షణ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలను కాపాడుకుని, వారు జీవితంలో ఎదగడానికి అన్ని విధాల ప్రోత్సహించాలన్నారు. ఆడపిల్లల చట్టాలపై జిల్లాలోని ప్రతి పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలన్నారు. బాలికల సంరక్షణ అందరి బాధ్యతని చెప్పారు. బాలికల ప్రాధాన్యం, సంరక్షణ, బాధ్యతలపై కుటుంబాలు, సమాజంలోని అన్ని వర్గాలు అవగాహన కలిగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం సిగ్నేచర్ క్యాంపెయిన్ పోస్టర్‌పై కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ జన్మదిన వేడుకల్లో జనసేనానిని చితకబాదిన టీడీపీ నేతలు

- అడ్డుకోబోయిన అతని తల్లికి పళ్లు రాల్చారు
- రెడ్ బుక్ నేత అనుచరుల అరాచకం
- జనసేనకు పరాభవం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనసేన కార్యకర్త మునీర్‌బాషా

సాక్షిటాస్క్ ఫోర్స్: అధికారంలోకి రాగానే కూటమి లో భాగస్వాములైన జనసేన, బీజేపీ నాయకులకు పలుచోట్ల అవమానాలు తప్పలేదు. తాజాగా సోమల మండలంలో గురువారం రాత్రి మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో లోకేష్ బ్యానర్లు కట్టినందుకు, కేక్ కట్ చేసే కార్యక్రమంలో పాల్గొన్నందుకు జనసేన కార్యకర్తను టీడీపీ నాయకులు చితకబాదారు. సోమల మండలం కందూరులో జనసేన కార్యకర్త మునీర్ బాషా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, లోకేష్ బ్యానర్లు వేసి జన్మదిన సంబరాల్లో పాల్గొన్నారు. దీంతో రెచ్చిపోయిన తెలుగుదేశం నాయకులు మునీర్ బాషాను 'నువ్వెవడురా రావడానికి' అంటూ చితకబాదారు.. ఈ సంఘటనను చూసిన ఆయన తల్లి బిడ్డను కొట్టడం అడ్డుకున్నారు. ఆమెను కూడా కొట్టడంతో ఆమె పళ్లు రాలిపోయాయి. వెంటనే అక్కడున్న గ్రామస్తులు పుంగనూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి చిన్నారాయల్‌కు సమాచారం అందించారు. ఆయన తన అనుచరులతో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడు కుటుంబాన్ని పరామర్శించారు. గాయపడిన మునీర్ బాషాను, ఆయన తల్లిని, జనసేన కార్యకర్తలు నాయకులు కలిసి పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారు చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు జనసేన నేతలు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేస్తారా? లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

విద్యార్థులను ఆత్మహత్యలకు ప్రేరేపణ

- నారాయణపై మాజీ మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం



నగరి : విద్యార్థులకు విపరీతమైన ఒత్తిడి పెంచి వారు ఆత్మహత్య చేసుకునేలా నారాయణ యాజమాన్యం ప్రేరేపిస్తోందని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆరోపించారు. గురువారం అనంతపురం నారాయణ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న చరణ్ అనే విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆమె ఈ మేరకు స్పందించారు. విద్యార్థులపై స్థాయికి మించిన ఒత్తిడి, ఫీజుల కోసం వేధింపులు అంటూ పలు రకాలుగా హింసించడమే ఆ విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించినట్లు తెలుస్తోందన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఉండగానే ఒక విద్యార్థి బయటకు వచ్చి దూకేశాడంటే వారి పర్యవేక్షణ ఏ మేరకు ఉందో అర్థమవుతోందన్నారు. ఫీజులపై వారికున్న దృష్టి విద్యార్థుల సంరక్షణపై లేదన్నారు. ఒత్తిడి, పర్యవేక్షణ లోపం బాధ్యతగా నారాయణను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

టిప్పర్ బోల్తా

వెదురుకుప్పం: మండలంలోని గోవిందవారిపల్లె సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గురు వారం సాయంత్రం టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. పచ్చికాపల్లం వైపు వస్తున్న టిప్పర్ బోల్తా పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం

బైరెడ్డిపల్లె: మండలంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాల, కడపనత్తం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం సభ్యులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేద విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డులు, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ మల్లికార్జున, జిల్లా రిసోర్స్ పర్సన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న విజయలక్ష్మి

ఉపాధి లెక్క.. అక్రమాలు పక్కా!

ఉపాధి హామీ పథకం.. రూ.కోట్లు ఖర్చవుతున్నాయి. ఆ ఫలాలు మాత్రం క్షేత్రస్థాయికి చేరడం లేదు. అడిగినన్ని నిధులు కుమ్మరిస్తున్నారు. అభివృద్ధిలో నీరసం వీడడం లేదు. ఇందుకు కారణం కూటమి నేతల చేతివాటమే. ఇదీ నేడు పలమనేరు నియోజకవర్గంలో ఉపాధి లెక్క.

- పాత పనులకే నగిషీలు
- యథేచ్ఛగా జేసీబీతో పనులు
- నకిలీ జాబ్‌కార్డుల సృష్టి
- బినామీ కూలీల పేరుతో బిల్లులు



వి.కోట మండలం అత్రపల్లి చెరువులో జేసీబీతో పనులు

పలమనేరు: కూటమి నేతలకు ఉపాధి పనులు జేబులు నింపే ఏటీఎంలుగా మారాయి. ఉపాధి అధికారుల అండదండలతో ఇష్టానుసారంగా అక్రమాలు చేస్తూ దోచుకుంటున్నారు. గతంలో చేసిన గుంతలకే నగిషీలు దిద్ది, కొత్తగా పనులు చేసినట్లు చూపించడం, బినామీ కూలీల ద్వారా పనులు చేయించి జాబ్‌కార్డున్న వారిపై మస్టర్లు సృష్టించండం ఇంత తేలికా? అనే రీతిలో బిల్లులు చేసుకుంటున్నారు. వీరికి ఉపాధి ఏపీడీ మొదలు ఏపీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరిస్తున్నారు. దీనికితోడు గతంలో ఉన్న మేట్లను తొలగించి, కూటమికి అనుకూలంగా ఉన్నవారిని పెట్టుకున్నారు. దీంతో ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోని చందంగా ఉపాధిలో అక్రమాలు జోరుగా సాగుతున్నాయి.

నిబంధనలిలా...

ఆయా గ్రామంలో ఉపాధి పనులు జరగాలంటే గ్రామసభలను నిర్వహించి, అవసరమైన పనులను గుర్తించాలి. ఆపై జాబ్ కార్డున్న వారికి అందులో పనులు కల్పించాలి. ఈ తీర్మానాన్ని సంబంధిత పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు ఆమోదించాలి. ఆపై ఉపాధి అధికారులు పనులు పర్యవేక్షిస్తూ పనులు చేపట్టి వాటిని మస్టర్‌లో నమోదు చేస్తూ జీపీఎస్ ఆధారంగా బిల్లులు పెట్టాలి. కానీ కూటమి నేతలు ఉపాధి అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. జరుగుతున్న పనుల్లో సగానికి పైగా నిధులను బొక్కేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఇప్పుడు సాగుతున్న తీరిలా...

ప్రస్తుతం ఈజీఎస్ పథకం కింద ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే ప్రక్రియగా గతంలో నాటిన మొక్కలను చూపి, బిల్లులు చేసుకుంటున్నారు. సప్లయి చానళ్లు, ఫారమ్ పాండ్స్ తదితరాలను జేసీబీలతో చేసి, వాటిని కూలీలు చేసినట్లు తప్పుడు రికార్డుల చూపి, డబ్బులు దోచుకుంటున్నారు. ఇక పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో క్యాటిల్ షెడ్ల నిర్మాణాలను కూటమి అనుచరులకు కేటాయించి వారు నాసిరకంగా పనులు చేసినా బిల్లులు చెల్లిస్తున్నారు. క్యాటిల్ షెడ్ల లబ్ధిదారుల ఎంపిక సైతం ఆయా మండలాల ఈజీఎస్ అధికారులకు సంబంధం లేకుండా కూటమి నేతలే ఎంపిక చేసుకున్నారు.



వి.కోట మండలంలో యంత్రాలతో చేసిన పనులు

ఉపాధి పనులు కావవి.. కాంట్రాక్టు పనులు

సాధారణంగా కూలీలకు పని కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నిజమైన కూలీలకు పనులు దొరకడం లేదు. జాబ్ కార్డులు ఉన్న కూలీలకు బదులు కూటమి నేతలే కాంట్రాక్టర్లుగా మారి జేసీబీ వాహనాలతో పనులు చేసి బినామీ కూలీల ద్వారా నగిషీలు దిద్దించి, బిల్లులు పెట్టుకుంటున్నారు. ఇక చెరువుల్లో ఇసుకను తోడేందుకు పైనున్న బంకమట్టిని జేసీబీ ద్వారా తొలగించి ఆ మట్టిని రైతుల పొలాలకు తోలుతున్నారు. చెరువుల్లో తవ్విన గుంతలకు ఉపాధిలో బిల్లులు, గుంత కింద ఉన్న ఇసుకను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమాలు ఓ చోటకాదు అన్ని మండలాల్లోనూ సాగుతూనే ఉన్నాయి. నియోజకవర్గంలో ఈ ఆరు నెలల్లో రూ.5 కోట్ల వరకు పనులు జరగ్గా ఇందులో రూ.4 కోట్ల విలువైన అక్రమాలు సాగినట్టు సమాచారం. కనీసం జిల్లా అధికారులైనా ఇక్కడ జరిగిన, జరుగుతున్న ఉపాధి పనులను ఓ సారి పరిశీలిస్తే అక్రమాలు వెలుగు చూస్తాయి.

అలాంటిదేమీ లేదన్నా...

ఈ విషయమై పలమనేరు ఏపీఓ పుష్పలతను వివరణ కోరగా ఉపాధిలో ఎలాంటి అక్రమాలు లేకుండా పటిష్ఠంగానే జరుగుతున్నాయి అన్నా అని చెప్పారు. పలు మండలాల ఉపాధి అధికారులు ఇదే మాటను చెప్పడం కొసమెరుపు.

పలమనేరు నియోజకవర్గం సమాచారం

మండలాలు	: 5
పంచాయతీలు	: 90
గ్రామాలు	: 520
ఈజీఎస్ బడ్జెట్	:రూ.5 కోట్లు
చేస్తున్న పనులు	: ఫారమ్ పాండ్‌లు, చెరువుల్లో పూడికతీత, పొలాలకు మట్టి, క్యాటిల్ షెడ్లు, మొక్కల నాటడం

నలుగురు లాటరీ విక్రేతల అరెస్టు

- రూ.36 వేల విలువైన టికెట్లు
- రూ.17వేల నగదు స్వాధీనం

పుంగనూరు: పట్టణంలో విచ్చల విడిగా లాటరీ విక్రయాలు జరుగుతుండడంతో గురువారం పోలీసులు దాడులు చేసి, నలుగురిని అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పట్టణంలోని తూర్పు మొగసాల ప్రాంతంలో లాటరీ టికెట్లు జోరుగా విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో కాపు కాచి లాటరీ వ్యాపారులు గణేష్, నాగరాజ, సుబ్రమణ్యం, ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.36 వేల విలువచేసే లాటరీ టికెట్లు, రూ.17 వేల నగదు స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.